క్లుప్తంగా

కల్వర్టు ప్రారంభం



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని ఇందిరమ్మ మోడల్ కాలనీ ముందు ఉన్న పంట కాలువపై పోలంపల్లి డ్యాం చైర్మన్ పొన్నం బాలాజీ సొంత నిధులు రూ.35 వేలతో నిర్మించిన కల్వర్టును శనివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రం–3ను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రానికి కాంపౌండ్ వాల్, బోరు కావాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు కోరగా త్వరలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు పొందూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెండితాపడం తయారీకి వితరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ ఆలయంలోని అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి శనివారం ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన కొంక గురవయ్య, వెంకాయమ్మ దంపతులు రూ.51,116 విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్లు కృష్ణమోహన్, శశికపూర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వరద నీటితో అవస్థలు



నందిగామ రూరల్: మండలంలోని సోమవరం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలోకి శుక్రవారం రాత్రి వరద నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రహదారులు ఇంటి ఆవరణలో నిలిచిన నీటిని బక్కెట్‌లతో బయటకు తోడుకోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఆయా గ్రామాలలోని పంట పొలాలు సైతం నీట మునగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



పెనుగంచిప్రోలు: ఎరువుల నిల్వలు, ధరలకు సంబంధించి దుకాణం ముందు పట్టికలో సూచించాలని ఏఓ కె. రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఆయన గ్రామంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మితో కలిసి తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాక్ రిజిస్టర్లు, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, ఈ–పాస్ మిషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఈ– పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఇవ్వాలని గ్రోమోర్ సిబ్బందికి సూచించారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, యూరియా కావాలంటే ఇతర కాంప్లెక్స్ ఎరువులు కొనాలని లింకు పెట్టకుండా సరఫరా చేయాలని డీలర్లను హెచ్చరించారు. రైతు ఆధార్ కార్డు, రైతుల పాస్‌బుక్ జిరాక్స్‌ను చూసి యూరియా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హలీమ్, వీఆర్‌ఓ సుధశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మైలవరం: యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు రెండో రోజైన శనివారం కొనసాగాయి. ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థుల్లో శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం పెంచుకుని విద్యలో రాణించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి మాట్లాడుతూ క్రీడలను ప్రాథమిక విద్యలో భాగం చేయాలన్నారు. తద్వారా క్రీడాకారులు చిన్ననాటి నుంచే మంచి నైపుణ్యాన్ని సాధించి క్రీడల్లో ఉన్నత శిఖరాలకు చేరుకుని దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తారన్నారు. క్రీడలు ముగింపు అనంతరం విజేతలకు బంగారు, కాంస్య పతకాలు ప్రదానం చేశారు.

జై గణేశా.. బైబై గణేశా!

కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాలు



పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో..

వత్సవాయి: గణపతి నవరాత్రి వేడుకులు గ్రామాలలో ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం కొన్ని గ్రామాల్లో గణనాథుల విగ్రహాలను నిమజ్జనం కోసం ముక్త్యాల, వేదాద్రి గ్రామాలకు తరలించి అక్కడ పూజాకార్యక్రమాలు నిర్వహించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. మరికొన్ని గ్రామాల్లో ఐదు రోజుల పూజల అనంతరం సోమవారం నిమజ్జనాలకు తరలిస్తే ఇంకొన్ని గ్రామాల్లో తొమ్మిది రోజులు పూజలు తర్వాత నిమజ్జనాలకు తరలిస్తారు. గణేష్ మండపాల వద్ద రాత్రి సమయాల్లో పూజాకార్యక్రమాల అనంతరం స్వామివారి చేతిలో పెట్టిన లడ్డూల వేలం నిర్వహిస్తున్నారు.

వీరులపాడు: మండలంలో వినాయక మండపాలలో గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథునికి భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల: స్థానిక గొట్టుముక్కల రోడ్డులో హనుమాన్‌పేట గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడికి శనివారం భక్తులు పూజలు చేశారు. అర్చకుడు కాకాని పవన్‌కుమార్‌బాబీ పూజలు చేశారు. స్వామివారికి భక్తులు నైవేద్యం సమర్పించారు. అనంతరం గణేష్ యూత్ కమిటీ సభ్యులు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు.

వేదాద్రి(జగ్గయ్యపేట): మండలంలో వినాయక నిమజ్జన సందడి నెలకొంది. మూడు రోజులు కావటంతో విగ్రహాలను భారీగా నిమజ్జనాలకు గ్రామంలోని కృష్ణానదికి తరలిస్తున్నారు. శనివారం పలు గ్రామాల నుంచి నిమజ్జనానికి విగ్రహాలు రావటంతో నదీ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది, నిమజ్జనాల ఉత్సవ ప్రత్యేక అధికారి ఏసీపీ వెంకటేశ్వర్లు ఆ ప్రాంతంలోని ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, ట్రైనీ ఎస్ఐ మణికంత, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ సెంటరు మండపంలో..

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలకు భక్తులు విశేషంగా పూజలు చేస్తున్నారు. నాల్గవరోజు శనివారం పందిళ్లలో గణేష్ విగ్రహాలకు విశేష పూజలతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నవరాత్రుల వేడుకలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల తరువాత కొన్ని విగ్రహాల నిమజ్జనాలు కూడా సాగుతున్నాయి.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో శనివారం నాల్గవ రోజున గణనాథులకు పూజలు నిర్వహించారు. పట్టణంలోని కోదాడ రోడ్‌లో మార్కెట్ యార్డు ఎదురుగా ఛత్రపతి శివాజీ ఫౌండేషన్, ఏపీ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన మట్టి గణపతి మండపం పట్టణంలో ఆకర్షణగా నిలిచింది. స్థానిక తోటబజారులో సంఘమేశ సేన ఆధ్వర్యంలో 20 అడుగుల గణనాథుడు ఆకర్షణగా నిలిచాడు.

నందిగామ టౌన్: పట్టణంలోని వాసవీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో సింహాచల వరహా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణాన్ని శనివారం నిర్వహించారు. సింహాచలం నుంచి తీసుకువచ్చిన స్వామి వారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి కల్యాణ వేదికపైకి తీసుకెళ్లారు. అనంతరం సింహాచలం ఆలయ పండితులు సీతారామాచార్యులు, నృసింహాచార్యులు ఆధ్వర్యంలో వరాహ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వేదోక్తంగా జరిపించారు. నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శ్రీరాం ధనుంజయ పూజలు చేశారు. పట్టణంలోని గాంధీ సెంటరులో అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వేదాద్రి వద్ద నిమజ్జనానికి వచ్చిన విగ్రహం



మక్కపేటలో నిమజ్జనానికి తరలిన గణనాథుడు



పేట ఏఎంసీ ఎదురుగా ఛత్రపతి శివాజీ కోట రూపంలో సెట్టింగ్

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



సీఐటీయూ మండల నూతన కమిటీ

నందిగామ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలలో మార్పులు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఐటీయూ మండల తొమ్మిదవ మహాసభను శనివారం పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, ఆయా విభాగాలలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అందించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు చెప్పారు.

మండల కమిటీ ఎన్నిక..

సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. మండల అధ్యక్షురాలిగా ఆదూరి సుశీల, కార్యదర్శులుగా కటారపు గోపాల్, వెంకట్రావమ్మ, కోశాధికారిగా తిరుమల దేవి, ఉపాధ్యక్షులుగా దాసవరపు సైదా, సరళ, ఏసోబు, సభ్యులుగా మాణిక్యం, షేక్ హుసేన్, కర్రి వెంకటేశ్వరరావు, లాజర్, కుక్కల శ్రీను, లక్ష్మిలను ఎన్నుకున్నట్లు చెప్పారు.

విచ్చల విడిగా ఫ్లెక్సీలు.. పట్టించుకోని అధికారులు

అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా వదలని ఫ్లెక్సీ



పేటలోని రైతుబజారు కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి అమర్చిన ఫ్లెక్సీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఎక్కడ చూసినా వివిధ రకాల ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. ఫ్లెక్సీ రహిత పట్టణంగా జగ్గయ్యపేట పట్టణాన్ని ఉంచాలని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గం పదేపదే ప్రకటించడంతో పాటు సభలు, సమావేశాలు, ర్యాలీలు కూడా నిర్వహించి ప్రచారం చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాల్సిందే, ఏదైనా పండుగలు, పర్వదినాలు, పుట్టినరోజు వేడుకల సందర్భంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వారంలోగా తొలగించాలని నిబంధనలను విధించారు. దీనికి మునిసిపాలిటీ ఆమోదముద్ర వేసింది. కానీ ఆ ఉత్తర్వులు, ప్రకటనలు ఆరంభ శూరత్వమేనని ప్రస్తుత పరిస్థితులను చూస్తే అర్థం అవుతోంది. ఈ క్రమంలో స్థానిక రైతుబజారు వద్ద పట్టణంలోనే అతిపెద్ద కూడలిగా ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కూడా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. భారత దేశ ప్రజలంతా ఎంతో గౌరవించే అంబేడ్కర్ విగ్రహానికి కూడ ఫ్లెక్సీలు పెట్టి ఆయనను అవమానించారంటూ పలువురు ప్రజలు, అంబేడ్కర్ వాదులు, పలు వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పట్టణంలో విచ్చలవిడిగా ఉన్న ఫ్లెక్సీలను నియంత్రణపై చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా అంబేడ్కర్ విగ్రహానికి ఏ ఫ్లెక్సీ పెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి ఫ్లెక్సీ గురించి శనివారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో కూడా మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ప్రస్తావించగా, చైర్మన్ స్పందిస్తూ ఎమ్మెల్యే తాతయ్య కూడా వారంలోనే ఏ ఫ్లెక్సీ అయినా తొలగించాలని చెప్పారు గదా ఎందుకు అధికారులు తొలగించలేదని నిలదీశారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. గ్రామంలో శనివారం ఆయన స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఐదు బృందాలు సర్వే చేస్తున్నాయన్నారు. వర్షాకాలంలో కావటంతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

జగ్గయ్యపేట: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని డీఎంహెచ్‌వో సుహాసిని పేర్కొన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర పిల్లల వైద్యశాల, సహస్ర వైద్యశాల, స్వాతి డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లను శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రి రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఎన్విరాన్‌మెంట్, తదితర అనుమతుల పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిసెప్షన్ కౌంటర్ వద్ద ప్రభుత్వ అనుమతుల పత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని డయాగ్నొస్టిక్ సెంటర్‌లు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అటువంటివి వస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యారోగ్య శాఖాధికారులు తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి రియాజ్

నందిగామ టౌన్: చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సత్వర న్యాయం పొందే వీలుంటుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో నందిగామ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలతో పాటు మహిళల హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ ఆజాద్, కొమ్మినేని మాలేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత తనిఖీ



వీరులపాడు: వీరులపాడు: ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించటంతో పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్వాలిటీ కంట్రోల్ అధికారి భాస్కరరావు పేర్కొన్నారు. పెద్దాపురం– తెలంగాణ సరిహద్దు వరకు నిర్మించిన ఆర్‌అండ్‌బీ రహదారి పనులను మండలంలోని పెద్దాపురం గ్రామంలో అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కి.మీ మేర రహదారి నిర్మాణానికి రూ.73 లక్షల నిధులు మంజూరయ్యా యన్నారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ జేఈ శశిభూషన్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖిల్లా ముఖద్వారం పనుల పరిశీలన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బొమ్మల పరిశ్రమను అంతర్జాతీయంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా కొండపల్లి ఖిల్లా రోడ్డులో జరుగుతున్న ముఖద్వారం పనులను మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బొమ్మల కళాకారులకు కావల్సిన మౌళిక వసతులు కల్పించడంతో పాటు బొమ్మల విక్రయాలు కొనుగోలు, బొమ్మల కాలనీ అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. త్వరలో పనులు పూర్తవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించాలి

గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి బాలాజీ పేర్కొన్నారు. గ్రామంలోని కేవీకేలో శనివారం వ్యవసాయ అధికారుల శిక్షణ తరగతి శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు కురుస్తున్నాయని రైతులకు పంటల్లో తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయాధికారులు వివరించాలన్నారు. పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. పురుగులు, చీడపీడలు, తెగుళ్లు, తదితర విషయాలపై రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. శాస్త్రవేత్తలు కూడా రైతులకు సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వరరావు, ఏడీఏలు, ఏ వోలు, కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పెట్రోల్ బంక్ కార్మికుడు

ఇబ్రహీంపట్నం: వీటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో నగదు గోల్‌మాల్ ఆరోపణలు ఎదుర్కొని పరారీలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడు గోపాలకృష్ణ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పెట్రోల్ బంక్‌లో విధులు నిర్వహించి ఈనెల ఒకటిన అదృశ్యమైనట్లు 8వ తేదీన అతని భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంటికి వచ్చినట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇతను కోట్లలో నగదు కుంభకోణంకు పాల్పడ్డాడనే ఆరోపణలు ఉన్నాయి. పాలకవర్గం మాత్రం కేవలం రూ.15లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు చెబుతున్నారు. నగదు విషయంపై విచారణ చేపట్టినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. అయితే స్థానిక ద్వితీయశ్రేణి కూటమి నేతలు రంగప్రవేశం చేసి బయట ప్రైవేట్ పంచాయతీలో నగదు విషయం తేల్చేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

నిధుల కేటాయింపులో వివక్షతపై నిరసన

జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న కౌన్సిలర్ వట్టెం మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లో తన వార్డులో ఇప్పటి వరకు లక్ష రూపాయలు కూడా నిధులు కేటాయించకుండా వివక్షత చూపుతున్నారని వైఎస్సార్ సీపీకి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కౌన్సిల్ మీటింగ్‌లో సమస్యలు వివరిస్తుండగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర వద్దు క్లోజ్ చేయండి, ఇక చాలు అని అర్ధాంతరంగా మైక్ కట్ చేసి తీవ్రంగా అవమానించారంటూ మనోహర్ సమావేశం నుంచి వాక్‌అవుట్ చేశారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ ఆర్టీసీ కాలనీలో గత నెల రోజులుగా తాగునీటి సమస్య ఉందని, అక్కడ పనిచేసిన కంట్రాక్టర్ జంగిల్ క్లియరెన్స్ సందర్భంగా పొక్లెయిన్‌తో పైపులైన్‌లను ధ్వంసం చేశాడన్నారు. తమ వార్డులో రోడ్డు పగిలిపోగా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కంట్రాక్టర్లకు టెండర్ల ఈఎండీ అడ్వాన్స్ చెక్కులను తిరిగి వారికి చెల్లించడానికి అధికారులు సుముఖంగా ఉంటున్నారని, దీనికి చైర్మన్ సహకరించడం బాధాకరమన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి కూడా ఫ్లెక్సీలు కట్టేస్తున్నారు

మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా

వైఎస్సార్ సీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా మాట్లాడుతూ రైతుబజారు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కూడా ఒక రాజకీయ పార్టీవారు ఫ్లెక్సీలు పెట్టడం ద్వారా ఆయనను అవమానిస్తున్నారని, ఫ్లెక్సీ రహిత పట్టణం చేస్తామన్నారు ఇదేనా, పాలకవర్గానికి ఇవి కనిపించడం లేదని అని ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఏ ఫ్లెక్సీ అయిన వారం రోజుల్లో తీసివేయాలని ఎమ్మెల్యే తాతయ్య కూడా ప్రకటించారని, వెంటనే అధికారులు తొలగించాలని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీకి చెందిన ఉక్కు కళావేదిక లోపల వినాయకుని విగ్రహం సరిగా కనిపించడం లేదని పెద్ద చెట్టును మున్సిపల్ సిబ్బంది నరికి తీసుకెళ్లారని, దీనికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు.

7, 9 వార్డుల్లో తాగునీటి కొరత

7,9 వార్డుల్లో గత 20 రోజుల నుంచి తాగునీరు రావడంలేదని, కంట్రాక్టర్ చర్యవల్ల పైపులైన్ పగిలిపోతే అధికారులు పట్టించుకోవడం లేదని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ ఇది పూర్తిగా అధికారుల వైఫల్యమేనన్నారు. అనంతరం చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ తాగునీటి వ్యవస్థలో అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించుకొని తరచూ వచ్చే సమస్యలను అధిగమించవచ్చని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

పలు సమస్యలను ప్రస్తావించిన సభ్యులు

కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని కోరారు. రోశయ్య మాట్లాడుతూ కోదాడ రోడ్‌లో పైపులైన్ పూర్తిగా మార్చాలని సూచించారు. గింజుపల్లి వెంకట్రావు, కంచేటి గీతారాణి, ఇర్రి నరసింహారావు, అలేఖ్య, గొట్టె రామకృష్ణ పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ కమిషనర్ టీవీ.కృష్ణారావు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

3న హుండీ కానుకల లెక్కింపు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు సెప్టెంబరు 3న నిర్వహిస్తున్నట్లు ఈవో సాంబశివరావు శనివారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలి

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్–25 నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కే రామ్మోహనరావు శనివారం తెలిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్ అనే అడ్వాన్స్ టెక్నాలజీపై రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో క్వాంటమ్ వ్యాలీ హ్యాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను సృజనాత్మకతను ఉపయోగించి క్వాంటమ్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ప్రజెంటేషన్ చేసి సాంకేతిక అంశాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక అంశాలలో పట్టు సాధించాలని తద్వారా సమాజానికి ఉపయోగపడేవిధంగా టెక్నాలజీని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ ప్రజెంటేషన్‌లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన 5 టీంలను ఎంపిక చేశారు. వీరు సెప్టెంబర్ 10న విజయవాడలో జరిగే సెమీ ఫైనల్స్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం స్పోక్ బి.బాలాజీ, ప్రోగ్రాం ప్రెశిడెంట్ ఎం.శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సులభరీతిలో విద్యాబోధన చేయాలి

నందిగామ రూరల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కాంప్లెక్స్ చైర్మన్ ఆళ్ల రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్ధమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలన్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని, హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఉపాధ్యాయులకు ప్రవేశపెట్టిన హ్యాండ్ బుక్ విద్యార్థులకు సంబంధించిన ఎసైన్‌మెంట్ బుక్ నిర్వహణపై ఎస్‌ఈఆర్టీ అధికారులు ఆన్‌లైన్ ద్వారా శి

ఉద్యోగ విమరణ చేసిన సీఈవోలకు సత్కారం

కంచికచర్ల: స్థానిక కేడీసీసీ బ్యాంకులో వేములపల్లి, గొట్టుముక్కల పీఏసీఎస్‌లో సీఈఓలుగా పనిచేసి ఉద్యోగవిరమణ పొందిన వసంత వెంకటేశ్వరస్వామి, ముప్పాళ్ల వెంకటేశ్వర్లును శనివారం పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ నన్నపనేని రంగబాబు, బ్రాంచి చీఫ్ మేనేజర్ వై.గీతా భారతి, మేనేజర్ ఎం.మాళేశ్వరరావు, సూపర్‌వైజర్లు కే శ్రీను, బీ హరీష్ నాయక్, సహకార సహాయ రిజిస్ట్రార్ సీహెచ్ రామతీర్థ, వివిధ సహకార సంఘ సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.